కంకర పరిచారు.. బీటీ మరిచారు

- భైపాస్ రోడ్డు నిర్మాణంలో జాప్యం
- కంకర పరిచి రెండు నెలలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- త్వరితగతిన పూర్తి చేయాలని వేడుకోలు



జాన్‌పహాడ్ రోడ్డు నుంచి మిర్యాలగూడ రోడ్డు వరకు బైపాస్ రోడ్డు నిర్మాణానికి పరిచిన కంకర

నేరేడుచర : మున్సిపాలిటీ పరిధిలోని జాన్‌పహాడ్ రోడ్డు నుంచి మిర్యాలగూడ రోడ్డు వరకు చేపట్టే బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. ఈ రోడ్డు నిర్మాణానికి పంచాయతీరాజ్ నిధుల నుంచి కోటి 7 లక్షల 50 వేల రూపాయల నిధులను మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంజూరు చేయించారు. రోడ్డు నిర్మాణానికి గత రెండు నెలల క్రితం తవ్వి కంకర పరిచి వదిలేశారు. దీంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల రాకపోకలతో కంకర రాళ్లు లేచి ఇరు పక్కల గల గృహాలలోని వ్యక్తులకు, రోడ్డుపై వెళ్లే పాదచారులకు తగిలి గాయాల పాలవుతున్నారు. అయితే 40 ఫీట్ల బైపాస్ రోడ్డులో 5.5 మీటర్ల వెడల్పుతో బీటీ రోడ్డును కాంట్రాక్టర్ నిర్మించాలి. రోడ్డు కిలో మీటర్ పరిధి వరకు చేపడుతుంగా రోడ్డుకు ఇరువైపులా డ్రైయినేజీ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. కానీ సదరు కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణంలో సరైన కొలతలు పాటించకుండా ఇష్టానుసారంగా కంకర పరిచినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. కంకర పరిచే విషయం కూడా మున్సిపల్ అధికారులకు సమాచారం ఇవ్వలేదని తెలుస్తోంది. సరైన కొలతలు పెట్టి రోడ్డు నిర్మాణం చేపట్టడం లేదని రోడ్డు వెంట ఉన్న గృహస్తులు, ప్లాట్ల యాజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు చొరవ చూపి నిబంధనల ప్రకారం రోడ్డు నిర్మించేలా చూడాలని కోరుతున్నారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే పాలకవీడు, నేరేడుచర్ల మండలాల నుంచి వచ్చే వాహనదారులు నేరేడుచర్ల ప్రధాన కూడలికి కాకుండా బైపాస్ రోడ్డులో వెళ్తే ట్రాఫిక్ సమస్య తొలుగుతుందని అధికారులు బీటీ రోడ్డును త్వరితగతిన పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం



జాన్‌పహాడ్ రోడ్డు నుంచి మిర్యాలగూడ రోడ్డు వరకు చేపట్టే బైపాస్ రోడ్డు నిర్మాణంలో భాగంగా కంకర పరిచి వదిలేశారు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. కంకరపై ప్రమాదాల బారిన పడుతున్నాం. కంకర రాళ్లు లేచి గృహాలపై, పాదాచారులకు తగుతుండడంతో గాయాలవుతున్నాయి. అధికారులు త్వరితగితన బీటీ రోడ్డు నిర్మాణం చేపడితే ఇబ్బందులు తొలుగుతాయి.

– మల్లికంటి శ్రీనివాస్, నేరేడుచర్ల

త్వరితగతిన పూర్తి చేస్తాం



కాంట్రాక్టర్ జాప్యంతో బైపాస్ రోడ్డు నిర్మాణం ఆగిపోయింది. రోడ్డును త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

– ప్రదీప్, పంచాయతీరాజ్ ఏఈ, నేరేడుచర్ల

కాలు కోల్పోయిన మానసకు చేయూత



మానస కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న గణేష్ ఉత్సవ కమిటీ మహిళలు

మఠంపల్లి : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన దైద మానస ఇటీవల మిరపకాయలు ఏరేందుకు ఆటోలో కిష్టాపురం వెళ్తూ ప్రమాదవశాతు జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయి ఇంటి వద్దే ఉంటోంది. మానసది రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం. దీంతో మఠంపల్లి పాతబస్టాండ్ సెంటర్ గణేష్ ఉత్సవ కమిటీ మహిళలు రూ.12,116 నగదుతో పాటు నిత్యావసర సరుకులను గురువారం మానస కుటుంబానికి అందజేసి అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలో పిల్లుట్ల దుర్గమ్మ, వల్లపుదాసు జయమ్మ, నీలం రాములమ్మ, రేసు కనకమ్మ, వల్లపుదాసు రాములమ్మ, భద్రంరాజు నాగమణి, కంటు రామనర్సమ్మ, కత్తెర పల్లి గోవిందమ్మ, రమణ, అలివేలు మంగమ్మ, వరలక్ష్మి, నాగలక్ష్మి, పున్నమ్మ, సావిత్రమ్మ, చంద్రకళ, జ్యోతి, సరిత, శిరీష, ఉత్సవ కమిటీ సభ్యులు రామచంద్రయ్య, బాలకృష్ణగౌడ్, సాంబయ్య, గోపి, సురేష్‌గౌడ్, జాల కిరణ్‌యాదవ్, డాక్టర్ వీరభద్రచారి, మల్లారావు, ఏడుకొండలు, వీరబాబు, శ్రీనివాసరావు, గురువయ్య, చిన్నవీరయ్య, పెదవారయ్య, భిక్షాలు తదితరులు పాల్గొన్నారు.

రూ.10వేలు ఆర్థికసాయం..

దైద మానసకు స్థానిక శ్రీసత్యనారాయణ ఎంటర్ ప్రైజెస్‌కు చెందిన చీదెళ్ల సత్యనారాయణ గురువారం మానస కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు.

పారిశుద్ధ్య కార్మికులకు ప్రాధాన్యం ఇవ్వాలి

గరిడేపల్లి : పారిశుద్ధ్య కార్మికులకు మొదటి విడతలోనే ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు జోగు అరవింద్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం గరిడేపల్లి మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దివ్యాంగులు, వ్యవసాయ కూలీలు, భూమి లేని పేదలు, పారిశుద్ధ్య కార్మికులు, అనాథలు, ఒంటరి మహిళలు, ట్రాన్స్ జెండర్లకు ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన కోరారు.

ఇళ్లు ఉన్న వారికి పథకం వర్తింపజేయొద్దు

నడిగూడెం : అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని బీఆర్ఎస్ మండల కార్యదర్శి మేకల గంగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరులో అవకతవకలు జరిగే అవకాశమున్నదని, నిజమైన లబ్ధిదారులను గుర్తించి వారికే ఇళ్లు మంజూరు చేయాలన్నారు. గతంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు ఇందిరమ్మ పథకం వర్తింపజేయవద్దని కోరారు.

శిక్షణతో విద్యార్థుల్లో సృజనాత్మకత



గరిడేపల్లి : పానుగోడులో శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంఈఓ ఛత్రునాయక్



హుజూర్‌నగర్ : వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంఈఓ సైదానాయక్

గరిడేపల్లి : శిక్షణతో విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుందని ఎంఈఓ ఛత్రునాయక్ అన్నారు. గురువారం గరిడేపల్లి మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని పానుగోడు, కీతవారిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ప్రత్యేక వేసవి శిక్షణ శిబిరాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ధనమ్మ, అంబేద్కర్, బాబు, సీఆర్పీలు రామకృష్ణ, అశోక్‌కుమార్, వెంకటేశ్వర్లు, రాములు, ఉమ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

హుజూర్‌నగర్ : విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ సైదానాయక్ అన్నారు. గురువారం హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిబిరాలు ఈనెల 23వ తేదీ వరకు కొనసాగుతాయని తెలిపారు. శిబిరంలో విద్యార్థులకు డాన్స్, డ్రాయింగ్, వాలీబాల్, వ్యక్తిత్వ వికాసం, స్పోకెన్ ఇంగ్లిష్ తదితర అంశాలపై నిపుణులచే శిక్షణ ఇప్పిస్తున్నట్లు తెలిపారు. 6వ తరగతి నుంచిచి ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు ఈ శిక్షణ శిబిరంలో పాల్గొనవచ్చని, వారికి స్నాక్స్ కూడా అందచేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహాలు, ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన



ధ్వజస్తంభం ప్రతిష్ఠిస్తున్న గ్రామస్తులు

చిలుకూరు : మండలంలోని పోలేనిగూడెం గ్రామంలో గురువారం శ్రీపార్వతీ సమేత భీమలింగేశ్వరస్వామి, గణపతి విగ్రహాలతో పాటు, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాన్ని గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం ఆవరణలో ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. వేడుకల్లో కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ పాల్గొని నూతన ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ దైవభక్తి కలిగి ఉండాలని అన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే సమాజంలో గుర్తింపు



కబడ్డీ, వాలీబాల్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న భూలోకరావు

హుజూర్‌నగర్ : యువత క్రీడల్లో రాణించాలని, క్రీడల్లో రాణిస్తే సమాజంలో గుర్తింపు ఉంటుందని రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, జాతీయ కబడ్డీ క్రీడాకారుడు ఆర్.భూలోకరావు అన్నారు. గురువారం హుజూర్‌నగర్ పట్టణంలోని వీవీఎం హై స్కూల్‌లో శాంతిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవ్ ఎన్విరాన్‌మెంట్ అండ్ పబ్లిక్ స్కూల్స్, డాక్టర్ రమేష్ శీలా ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన వాలీబాల్, కబడ్డీ వేసవి ఉచిత శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు వేసవి శిక్షణను ఉపయోగించుకుని మంచి క్రీడాకారులుగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం శాంతి రెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఇంటర్నేషనల్ వాలీబాల్ క్రీడాకారుడు, రిటైర్డ్ ఐఆర్ఎస్ ఆఫీసర్ చందా సుధాకర్‌రెడ్డి క్రీడాకారులకు క్రీడా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో వీవీఎం హై స్కూల్ సుపీరియర్ సిస్టర్ గాలి సుందరి, తెలంగాణ పీడీ, పీఈటీ సంఘం జిల్లా అధ్యక్షుడు కదిర బ్రహ్మారెడ్డి, పీడీలు గాయం శ్రీకాంత్ రెడ్డి, కనకయ్య, పీఈటీలు శ్రీనివాసరెడ్డి, ప్రదీప్, ముక్కంటి, క్రీడాకారులు రూబెన్, ఇంద్రారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

కబ్జాకు గురైన చెరువులు, కుంటలను కాపాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న లెల్లెల బాలకృష్ణ

హుజూర్‌నగర్ : రాష్ట్రంలో కబ్జాకు గురైన చెరువులు, కుంటలు, కాల్వలను కాపాడాలని తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం హుజూర్‌నగర్ పట్టణంలోని అమరవీరుల స్మారక కేంద్రంలో శీలం శ్రీను అధ్యక్షతన నిర్వహించిన ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కబ్జాకు గురైన చెరువులు, కుంటలు, కాల్వలను ప్రభుత్వం శాటిలైట్ ద్వారా సర్వే చేసి ఎఫ్‌టీఎల్ పరిధిలో హద్దురాళ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ ఏడాది ఉచిత చేప పిల్లలకు బదులు మత్స్య సొసైటీల జల వనరులకు సరిపోయే చేప పిల్లల కొనుగోలు కోసం మత్స్య సొసైటీ ఖాతాల్లో నగదు జమ చేయాలన్నారు. మే 15న మత్స్యకారుల జాతీయ డిమాండ్స్ డే సందర్భంగా ఇందిరా పార్క్ వద్ద నిర్వహించబోయే మత్స్యకారుల మహా ధర్నాను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, టీఎంకేఎంకేఎస్ జిల్లా సహాయ కార్యదర్శి పి.హుసేన్, ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్.మల్లయ్య, పి.నాగేశ్వరరావు, జి.సముద్రం, వి.నరసయ్య, పి.వెంకటి, మురళి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు మఠంపల్లిలో ఎస్‌బీఐ సేవలు !



మఠంపల్లిలో ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన ఎస్‌బీఐ బ్రాంచ్

మఠంపల్లి : మఠంపల్లి మండల కేంద్రంలో ఎట్టకేలకు ఎస్‌బీఐ సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. దశాబ్దాల కాలంగా మఠంపల్లి మండల ప్రజలు ఎస్‌బీఐ సేవల కోసం హుజూర్‌నగర్ పట్టణానికి వెళ్తున్నారు. ప్రస్తుతం మండల కేంద్రంలోనే మట్టపల్లికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఎస్‌బీఐ బ్రాంచ్‌ను అధికారులు ఏర్పాటు చేసి ప్రారంభించారు. 12వ తేదీ (సోమవారం) నుంచి బ్యాంకు సేవలు ప్రారంభమవుతాయని ఎస్‌బీఐ అధికారులు తెలిపారు. ఎస్‌బీఐ బ్రాంచ్ ఏర్పాటుతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



గరిడేపల్లి : దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



విజయరాఘవపురం ఐకేపీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

గరిడేపల్లి: భూ సమస్యల సత్వర పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. గురువారం భూ భారతి పైలెట్ ప్రాజెక్టు రెవెన్యూ సదస్సులో భాగంగా గరిడేపల్లి మండలం వెలిదండ గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన సదస్సులో కలెక్టర్ మాట్లాడారు. ప్రస్తుతం పైలెట్ ప్రాజెక్టు కింద గరిడేపల్లి మండలంలో కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు ముగిశాక మిగతా మండలాల్లో నిర్వహిస్తామన్నారు. గానుగబండ రెవెన్యూ సదస్సులో 69దరఖాస్తులు, వెలిదండలో 269 దరఖాస్తులు రైతుల నుంచి స్వీకరించినట్లు పేర్కొన్నారు. అంతకుముందు కలెక్టర్ రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, దరఖాస్తుల స్వీకరణ అంశాలను పరిశీలించారు. ఈ సదస్సులో హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ రాజేందర్‌రెడ్డి, ఏఆర్ఐ రాంబాబు, ఎంఆర్ఐ ప్రవీణ్, అధికారులు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం ఎగుమతులు వేగవంతం చేయాలి

మునగాల: వాతావరణంలో మార్పులతో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు వేసిన ధాన్యం ఎగుమతులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. మునగాల మండలంలోని విజయరాఘవపురంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వర్షాలకు ధాన్యం తడవకుండా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తహసీల్దార్ వి.ఆంజనేయులు మాట్లాడుతూ.. మండలంలోని బరాఖత్ గూడెం, గణపవరం గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం నుంచి మూసివేస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్ఐ రామారావు, ఏపీఎం నాగెల్లి నగేష్, వ్యవసాయ విస్తరణాధికారి భవాని తదితరులు ఉన్నారు.

భూసమస్యలు అధికారుల దృష్టికి తీసుకురావాలి

- అదనపు కలెక్టర్ రాంబాబు



రెవెన్యూ సదస్సులో రైతుల సమస్యలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్, అధికారులు

గరిడేపల్లి: రైతులు తమ భూ సమస్యలను రెవెన్యూ సదస్సుల ద్వారా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. గురువారం గరిడేపల్లి మండలం గానుగబండలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. భూ భారతి చట్టం ప్రకారం ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక సదస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ధరణి కార్యక్రమం ద్వారా పరిష్కారం కాని పెండింగ్ సమస్యలను రైతులు భూ భారతి చట్టంలో అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. తమ సమస్యలను రుజువులతో కూడిన పత్రాలతో అధికారుల దృష్టికి తీసుకువచ్చినట్లయితే నెల రోజుల్లో సమస్యలను పరిష్కరిస్తామన్నారు. చిన్న చిన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తామన్నారు. రైతులు ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవిన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బండ కవిత, ఆర్ఐ ప్రవీణ్, అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలని ధర్నా



ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

మోతె : అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యం ఉండొద్దని, గ్రామ సభల ద్వారానే లబ్ధిదారులను ఎంపిక చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మట్టిపెల్లి సైదులు కోరారు. ఈమేరకు గురువారం మోతె ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సీపీఎం మోతె మండల కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయ సూపరింటెండెంట్ విజయకుమారికి వినితిపత్రం అందించారు. ముందుగా కొత్తబస్టాండ్ నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ కార్యదర్శి ములుకూరి గోపాల్‌రెడ్డి, మండల కమిటీ సభ్యుడు కాంపాటి శ్రీను, కిన్నెర పోతయ్య, సోమగాని మల్లయ్య, దోసపాటి శ్రీను, గుంటగాని ఏసు, డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి ఎలుగు మధు, ఎడమ పద్మ, తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో వాటర్ ప్లాంట్ ప్రారంభం



ప్యూరీఫయర్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దివిస్ లేబరోటరీస్ ప్రతినిధి కిశోర్‌కుమార్, ఆలయ ఈఓ, చైర్మన్

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీఇష్ట కామేశ్వరీ సమేత శ్రీస్వయంభు శంభులింగేశ్వర స్వామి దేవాలయంలో దివిస్ లేబరోటరీస్ ఆధ్వర్యంలో రూ. 16 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ప్యూరీఫయర్ వాటర్ ప్లాంట్‌ను గురువారం పరిశ్రమ ప్రతినిధి బొప్పాడి కిశోర్‌కుమార్ దేవాలయ చైర్మన్ శంభిరెడ్డి, ఈఓ కొండారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా బొప్పాడి కిశోర్‌కుమార్ మాట్లాడుతూ. ఆలయానికి వచ్చే భక్తులకు తాగునీటి సమస్య ఉండొద్దనే ఉద్దేశంతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

పిల్లలకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై చర్యలు

గరిడేపల్లి : 18 ఏళ్ల లోపు పిల్లలకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నలిగంటి నరేష్ అన్నారు. గురువారం స్థానికంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని, రోడ్డు ప్రమాదాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్ డ్రైవింగ్ చేసేవారు తప్పకుండా సీట్ బెల్టు పెట్టుకోవాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెంట్ తప్పకుండా ధరించి వాహనాలు నడపాలని కోరారు. పిల్లలకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

బస్ షెల్టర్లు లేక అవస్థలు




తాడువాయి వద్ద జాతీయ రహదారిపై బస్సుల కోసం ఎండలో ఎదురుచూస్తున్న ప్రయాణికులు

- బస్సుల కోసం ఎండలో నిరీక్షణ
- హైవేపై రోడ్డు ప్రమాదాలు
- బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయాలని ప్రయాణికుల వేడుకోలు

మునగాల : మండల పరిధిలోని పలు గ్రామాల్లో జాతీయ రహదారిపై బస్ షెల్టర్లు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మునగాల మండల కేంద్రంలో పాటు మండల పరిధిలోని ఆకుపాముల, ముకుందాపురం, బరాఖత్‌గూడెం, తాడువాయి, మొద్దులచెరువు, మాధవరం గ్రామాల్లో బస్ షెల్టర్లు లేవు. దీంతో కోదాడ, సూర్యాపేట పట్టణాలకు వెళ్లే ప్రయాణికులు ఎండనక, వాననక రహదారి వెంట నిలబడి బస్సుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొన్నది. పలు చోట్ల చెట్లు ఉంటే ప్రయాణికులు వాటి కింద బస్సుల కోసం వేచి ఉండాల్సి వస్తోంది. రోడ్డుపై బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులను జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనాలు ఢీకొట్టిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి ఆయా గ్రామాల పరిధిలో బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలి



జాతీయ రహదారిపై ఆయా గ్రామాల్లో బస్‌షెల్టర్లు లేకపోవడంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా తాడువాయి స్టేజీ వద్ద బస్‌షెల్టర్ లేకపోవడంతో ఐదు గ్రామాల ప్రజలు రహదారి వెంట ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ బస్సుల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొన్నది. తక్షణమే బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయాలి.

– పాతకొట్ల నాగరాజు, కలకోవ

క్లుప్తంగా

పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మఠంపల్లి : మండలంలోని గుర్రంబోడు తండాలో గల గిరిజన ఆశ్రమ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను 3వ తరగతి నుంచి 9వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైనట్లు పాఠశాల హెచ్ఎం బి.వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. 3వ తరగతిలో 40 సీట్లు, 4వ తరగతి 38 సీట్లు, 5వ తరగతిలో 34 సీట్లు, 6వ తరగతిలో 24 సీట్లు, 7వ తరగతిలో 24 సీట్లు, 8వ తరగతిలో 24 సీట్లు, 9వ తరగతిలో 21 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. అడ్మిషన్ల కోసం ఆధార్, రేషన్‌కార్డ్ జీరాక్సులు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, రెండు పాస్ ఫొటోలతో పాఠశాలలో సంప్రదించాలని అన్నారు. మరిన్ని వివరాలకు 8008212629, 9848767230 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పోలీస్ టార్గెట్ వెబ్ మూవీ పోస్టర్ ఆవిష్కరణ



లఘుచిత్రం పోస్టర్ ఆవిష్కరిస్తున్న పారా సీతయ్య, తదితరులు

కోదాడరూరల్ : కోదాడకు చెందిన ప్రముఖ లఘుచిత్ర నిర్మాత తిరూప్ ఏర్పుల దర్శకత్వంలో నిర్మిస్తున్న పోలీస్ టార్గెట్ వెబ్ మూవీ (లఘు చిత్రం) పోస్టర్‌ను డీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ సర్పంచ్ పారా సీతయ్య గురువారం కోదాడలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణానికి చెందిన తిరూప్ సందేశాత్మక చిత్రాలను నిర్మించి ప్రేక్షకుల ఆదరాభిమానాలు పొందారన్నారు. అనేక మంది కళాకారులను తయారు చేశారని అభినందించారు. కార్యక్రమంలో చింతా బాబు, పంది తిరపయ్య, నాగరాజు, నటీనటులు ఉన్నారు.

గుర్తింపు కార్డుల కోసం నమోదు చేసుకోవాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ రజిని

కోదాడరూరల్ : ఆధార్ తరహాలో కేంద్ర ప్రభుత్వం అందించే 11 అంకెలతో కూడిన ప్రత్యేక గుర్తింపు కార్డుల (యూనిక్ ఫార్మర్ ఐడీ) కోసం రైతులు తమ వివరాలు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి పాలెం రజిని అన్నారు. గురువారం కోదాడ మండల పరిధిలోని అల్వాలపురంలో గలద రైతు వేదికలో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రాజెక్టుపై రైతులకు అవగాహన కల్పించి మాట్లాడారు. భూమి ఉన్న ప్రతి రైతు తమ భూ సంబంధిత వివరాలను ఏఈఓల దగ్గర, మీ సేవా కేంద్రాల్లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. లేకుంటే కేంద్ర ప్రభుత్వం అందజేసే పీఎం కిసాన్ వంటి పథకాలు వర్తించవని తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ నాగేష్, రైతులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం

నడిగూడెం : కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం సాధ్యమని పార్టీ మండల అధ్యక్షుడు బూత్కూరి వెంకటరెడ్డి అన్నారు. గురువారం నడిగూడెం మండల పరిధిలోని చాకిరాల, శ్రీరంగాపురం, రత్నవరం, తెల్లబెల్లి గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశమంతా భారత రాజ్యాంగాన్ని సమర్థిస్తూ అంబేద్కర్‌ను ప్రపంచ మేధావిగా కీర్తిస్తుంటే బీజేపీ ప్రభుత్వం మాత్రం ఆయన రాసిన రాజ్యాంగాన్ని రద్దు చేయాలని కుట్ర పన్నుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గుండు శ్రీనివాస్, దున్నా శ్రీనివాస్, వేపూరి సుధీర్, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై హర్షం



హర్షం వ్యక్తం చేస్తున్న ఐవీఓ సభ్యులు

కోదాడరూరల్ : పాకిస్తాన్ ఉగ్రవాదులను తుదముట్టించేందుకు భారత్ ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడం పట్ల హర్షిస్తూ గురువారం కోదాడ పట్టణంలోని రాంరెడ్డిపాలెం రోడ్డులో గల 100 అడుగుల జాతీయ జెండా వద్ద ఇండియన్ వెటరన్ ఆర్గనైజేషన్ (ఐవీఓ) జిల్లా అధ్యక్షుడు గుండా మధుసూదన్‌రావు ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. మాజీ సైనికులు, ఐవీఓ సభ్యులు.. జైహింద్, జై జవాన్, భారత్ మాతాకీ జై అంటూ జాతీయ జెండాలు చేతపట్టి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గుండా మధుసూదన్‌రావు మాట్లాడుతూ.. భారత ఆడపడుచుల సిందూరాన్ని తుడిచిన పాకిస్తాన్ ముష్కరులకు భారత జవాన్‌లు తగిన బుద్ధి చెప్పారని అన్నారు. కార్యక్రమంలో ఐవీఓ సభ్యులు కె.వెంకన్న, జగిని ప్రసాద్, సామినేని రమేష్, సేకు శ్రీనివాసరావు, జి.నవీన్, బెలిదె భరత్, షేక్.రహీం తదితరులు ఉన్నారు.